
సాక్షి
గుంటూరు
గురువారం ; 2 ; మే ; 2024



206మందికి వైద్యపరీక్షలు

ఫిరంగిపురం: రేపూడిలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యాన బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 206 మందికి వైద్యురాలు శ్వేత పరీక్షలు చేసి మందులు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 505.0 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



శ్రీవారి కల్యాణ మహోత్సవం

నగరంపాలెం: గుంటూరు పండరీపురంలోని కోదండరామ మందిరంలో వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం మొదలయ్యాయి.

ఫ్రెండ్లీ సర్కారు గురు

ఉపాధ్యాయులకు అన్నివిధాలా అండగా ఉన్న వైఎస్ జగన్ ప్రభుత్వం

ఉద్యోగోన్నతుల కల్పనలో రికార్డు

- వందలాది సంఖ్యలో ప్రమోషన్లు ఇచ్చిన ప్రభుత్వం
- మొదటి రెండేళ్లు కోవిడ్‌తో ఆన్‌లైన్ తరగతులకే పరిమితం
- తరువాతి రెండేళ్లలో ప్రమోషన్లతో సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం
- ఉద్యోగస్థాయిని పెంచి, ఆర్థిక లబ్ధి చేకూర్చిన వైనం
- ప్రమోషన్ల ఊసే లేకుండా సాగిన గత టీడీపీ పాలన
- వైఎస్సార్ సీపీ పరిపాలనలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,455 మందికి ప్రమోషన్లు
- రోస్టర్, సీనియార్టీ పాటిస్తూ పారదర్శకంగా ప్రమోషన్లు
- గతేడాది ఉపాధ్యాయ బదిలీల ద్వారా 4,366 మందికి స్థానచలనం
- బకాయిల చెల్లింపు, ఆర్థిక ప్రయోజనాల మంజూరులో ఉపాధ్యాయులకు బాసట



ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయురాలికి ధ్రువపత్రం అందజేస్తున్న ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈఓ శైలజ (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో విద్యారంగంలో చోటు చేసుకున్న విప్లవాత్మక మార్పులతో పాటు ఉపాధ్యాయవర్గాలకు గతంలో ఏ ప్రభుత్వమూ చేయని మేలు జరిగింది. గత టీడీపీ పాలనలో అర్హులైన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వకుండా, తప్పుల తడక బదిలీలతో అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ విద్యారంగాన్ని గాడిలో పెట్టిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు సకాలంలో ఉద్యోగోన్నతులను కల్పించింది. తద్వారా ఉద్యోగంలో హోదా పెంచడంతో పాటు ఆర్థికంగా ప్రయోజనాలను ఇచ్చింది. అదేవిధంగా మాన్యువల్ బదిలీలస్థానంలో ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంతో ఉపాధ్యాయులు అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇంట్లో నుంచే దరఖాస్తు చేసుకునే విధానాన్ని అమల్లోకి తేవడంతో పాటు వేలాది మంది ఉపాధ్యాయులను ఏ ఒక్క తప్పిదానికి ఆస్కారం లేని విధంగా సీనియార్టీ ఆధారంగా కోరుకున్న చోటకు బదిలీ చేసి చూపిన ఘనత దక్కించుకుంది.

రికార్డు స్థాయిలో ఉద్యోగోన్నతులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2020, 2021 సంవత్సరాలు కోవిడ్ కారణంగా పాఠశాలల్లో తరగతులు జరగక, ఆన్‌లైన్ పాఠాలకే పరిమితమయ్యాయి. తరువాతి రెండేళ్ల కాలంలో ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులను రికార్డు స్థాయిలో నిర్వహించింది. 2022, 2023లలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ద్వారా వివిధ కేటగిరీలలో 1,455 మంది ప్రమోషన్ పొందారు. సీనియార్టీ ఆధారంగా ఉద్యోగోన్నతులతో పాటు బదిలీలను సైతం నిర్వహించడంతో ఉద్యోగోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులతో పాటు బదిలీల కోసం ఎదురు చూస్తున్నవారికి సైతం ప్రయోజనం చేకూరింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగ విరమణలతో ఖాళీ అయిన పోస్టులతో పాటు నాడు–నేడు, జగనన్న విద్యాకానుక పథకాల అమలుతో పెరిగిన విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని గ్రేడ్–2 హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయడంతో పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చారు. ఉద్యోగ విరమణలతో ఖాళీ అయిన పోస్టులకు ఎప్పటికప్పుడు షెడ్యూల్ విడుదల చేసి నెలవారీ ఉద్యోగోన్నతులు కల్పించిన ఘనత ప్రభుత్వానికే దక్కింది. అర్హులైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు కేడర్ల వారీగా సీనియార్టీ జాబితాలను విడుదల చేసి, సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సెలింగ్ ద్వారా ఉద్యోగోన్నతులు కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో 1,455 మందికి ప్రమోషన్లు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో అర్హులైన 1,418 మంది గత రెండేళ్లలో ఉద్యోగోన్నతులు పొందారు.

- 2022 అక్టోబర్ 11న డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో 39 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందారు.
- అక్టోబర్ 13న నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 511 మంది హైస్కూళ్లలో పనిచేసేందుకు ఎస్‌ఏ సబ్జెక్టు ఉపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందారు.
- 2023 జూలై 4న జరిగిన కౌన్సెలింగ్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని జెడ్పీ హైస్కూళ్లలో 52 మంది హెచ్‌ఎంలతో పాటు జోన్–3 పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మరో 37 మంది హెచ్‌ఎంలుగా ప్రమోషన్ అందుకున్నారు.
- జూలై 5న 74 మంది, జూలై 6న మరో 170 మంది స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ పొందారు.
- వీరితో పాటు జూలై 2న ఆర్జేడీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీనియార్టీ ప్రాతిపదికన 43 మంది హెచ్‌ఎంలు రెగ్యులర్ ఎంఈఓలుగా ఉద్యోగోన్నతిపై నియమితులయ్యారు.

వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల కేటాయింపు

ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులతో పాటు బదిలీలను చేపట్టిన ప్రభుత్వం ఉపాధ్యాయుల్లోని సీనియార్టీ, ప్రిఫరెన్షియల్ కేటగిరీలో పాయింట్లను కలిపి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో బదిలీలను నిర్వహించింది. ఈ విధంగా గతేడాది జూన్‌లో నిర్వహించిన బదిలీల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అన్ని కేడర్లకు చెందిన 4,366 మంది ఉపాధ్యాయులు కోరుకున్న పాఠశాలలకు బదిలీపై వెళ్లారు. మారుమూల ప్రాంతాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేస్తూ సిఫార్సులకు తావులేని విధంగా ఆన్‌లైన్ విధానంలో పట్టణ ప్రాంతాలకు బదిలీలు చేసింది. తద్వారా ఉపాధ్యాయులకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. దీంతో పాటు ఆర్జిత సెలవులు, పీఎఫ్ చెల్లింపులు, ఉద్యోగ విరమణ ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చేయడం ద్వారా ఉపాధ్యాయులకు ఆర్థికంగా అండదండలు అందించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును ఉపాధ్యాయులు మరువలేకున్నారు.

రేపు క్రోసూరుకు సీఎం వైఎస్ జగన్

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్



సిబ్బందికి సూచనలు చేస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్

క్రోసూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పెదకూరపాడు నియోజకవర్గం పరిధిలోని క్రోసూరు రానున్నారు. సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ బుధవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మధ్యాహ్నం 1.30 గంటలకు క్రోసూరులో జరిగే మేమంతా సిద్ధం సభలో ప్రసంగిస్తారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ క్రోసూరుకు హాజరై హెలిపాడ్ గ్రౌండ్‌ను, సభ జరిగే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, పెదకూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంగారావు, క్రోసూరు ఎస్‌ఐ మహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రోసూరు పర్యటన ఏర్పాట్లను పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. హెలీప్యాడ్, సభాస్థలం, వాహనాల పార్కింగ్ అంశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

న్యూస్‌రీల్

రేపు మహిళా కళాశాలలో ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈనెల 3వ తేదీన ఉదయం 10 గంటలకు ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలో జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు డిగ్రీ, పీజీ (బీటెక్, ఎంబీఏ మినహా) పూర్తి చేసిన 26 ఏళ్ల లోపు వయసు గల యువతీ, యువకులు హాజరు కావాలని సూచించారు. బయోడేటా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, ఇతర అర్హతలకు సంబంధించిన జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరు కావాలని తెలిపారు.

మద్యం షాపుల తనిఖీ



నెహ్రూనగర్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళగిరి, తాడేపల్లి పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్స్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీ మాట్లాడుతూ సిబ్బంది నిబంధనలకు మేరకు మద్యం అమ్మకాలు చేపట్టాలని, అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

జూన్ 29న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: ఈనెల 11వ తేదీన నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ జూన్ 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్.సత్యశ్రీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. వినుకొండ టౌన్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని, ఎలాంటి అలజడులు లేకుండా ఎవరి ఓటు వారు వినియోగించుకోవాలని సూచించారు. సమస్యాత్మకమైన గ్రామాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట వినుకొండ సీఐ సాంబశివరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేర సమాచారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నరసరావుపేటటౌన్: నేర సమాచార సేకరణ నిమిత్తం ఎక్సైజ్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి జి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. మద్యం అక్రమాలపై సంబంధిత కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9032690039 కు తెలియజేయాలన్నారు. సమాచారం అందజేసిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడ్డ 17 మంది సిబ్బందిని ఉద్యోగం నుంచి తొలగించామని తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.7.92 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5500, గరిష్ట ధర రూ.7800, మోడల్ ధర రూ.6500 వరకు పలికింది.

• పింఛను.. అందెను



గుంటూరు సాకేతపురం శ్రీరామమందిరం ఎదుట వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

మందపాటి నేతృత్వంలో ఘనవిజయం తథ్యం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు అభినందన సభలో ఎమ్మెల్యే శివకుమార్



మందపాటి శేషగిరిరావు, ఎమ్మెల్యే శివకుమార్‌కు గజమాలతో సత్కారం

తెనాలి: వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు నేతృత్వంలో జిల్లాలోని ఎంపీ అభ్యర్థితో సహా అన్ని అసెంబ్లీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధించనున్నారని పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఉన్న మందపాటి శేషగిరిరావును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర పార్టీ నాయకత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ఆయనను ఇక్కడి గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. మందపాటి శేషగిరిరావు పార్టీకి అంకితమైన వ్యక్తి అని, కార్యదక్షత, పట్టుదల కలిగి నందునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు అప్పగించినట్లు ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. శేషగిరిరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని చెన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు. పార్టీ పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, కౌన్సిలర్లు దాసరి వీరవసంతరావు, షేక్ నూర్ ఇస్మాయిల్, యాతాటి అనిల్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

బాబు ర్యాలీ అట్టర్ ఫ్లాప్

ఉసూరు మనిపించిన చంద్రబాబు గుంటూరు ర్యాలీ

- జనం కోసం ర్యాలీ సమయాన్ని పొడిగించిన నాయకులు
- కనుచూపు మేరలో కానరాని బీజేపీ జెండాలు, నాయకులు
- అంతంతమాత్రంగానే ఉన్న జన సైనికులు
- జిన్నాటవర్ సెంటర్ మీటింగ్‌లోనూ కనిపించని జనం
- నసీర్ అహ్మద్‌పై చంద్రబాబు అసహనం
- చికాకుతో వెనుదిరిగిన అద్దె కార్యకర్తలు
- కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదంటూ శాపనార్థాలు



జిన్నాటవర్ సెంటర్‌లో చంద్రబాబు నాయుడు మాట్లాడుతున్నప్పుడు వెళ్లిపోతున్న టీడీపీ కార్యకర్తలు

గుంటూరు వెస్ట్: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం గుంటూరు నగరంలో నిర్వహించిన ర్యాలీ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో టీడీపీ శ్రేణులు నిరాశకు లోనయ్యారు. సాయంత్రం ఐదు గంటలకల్లా రింగ్‌రోడ్డులో చంద్రబాబు నాయుడు ర్యాలీ ఉందని ముందుగా ప్రచారం చేశారు. సాయంత్రం 5 నుంచి 7 గంటలకు కూడా పెద్దగా రోడ్లపైకి జనం రాకపోయేసరికి టీడీపీ నాయకులు ఆందోళనకు లోనయ్యారు. ఈలోగా శివారు ప్రాంతాల నుంచి మనిషికి రూ.300 చొప్పున ఇచ్చి తెచ్చిన వారు కూడా కనీసం నీళ్లు కూడా ఇవ్వలేదని ఆందోళన చేశారు. కొందరు వెనుదిరిగి వెళ్లిపోయారు. సాయంత్రం 6.40కి చంద్రబాబునాయుడు గోరంట్లలోని శ్రీకన్వెన్షన్‌కు చేరుకున్నా అరగంట తర్వాత గాని అక్కడి నుంచి బయలుదేరలేదు. జనం వచ్చిన తర్వాతే గుంటూరు రింగ్ రోడ్డులో చంద్రబాబు నాయుడు ర్యాలీ ప్రారంభమైంది. రోడ్డుకు ఇరువైపులా భారీగా జనం సమకూరతారని ఆశించిన టీడీపీ నాయకులు ఆ స్థాయిలో ప్రజలు రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి లాడ్జిసెంటర్ వరకు టీడీపీ జెండాలు, అక్కడక్కడా జనసేన జెండాలు కనిపించాయి. బీజేపీ జెండాలు గానీ, ఆ పార్టీ నాయకులు గానీ కనుచూపుమేరలో కానరాకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులకు సందేహం ఏర్పడింది. వారు స్థానిక బీజేపీ నాయకులకు ఫోన్లు చేసి ఎందుకు రాలేదని, కారణం చెప్పమని కోరారు. దీనికి బీజేపీ పెద్దగా స్పందించలేదు.

టీడీపీ ఓవరాక్షన్.. స్థానికుల వ్యతిరేకత..

టీడీపీ కార్యకర్తలు కొంత మంది అత్యుత్సాహం ప్రదర్శించి ట్రాఫిక్‌ను ఆపడానికి ప్రయత్నించారు. జనాలు భారీగా వచ్చారు అని చెప్పే ప్రయత్నం చేయగా, స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించారు. శంకర్‌విలాస్ సెంటర్ వద్ద 108 వాహనంలో క్షతగాత్రుడిని తీసుకుని వస్తున్న అంబులెన్సుకు కనీసం చంద్రబాబు నాయుడు గానీ, ఆయన వాహన శ్రేణిగానీ దారి ఇవ్వకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నోసార్లు తన కాన్వాయిని సైతం ఆపి అంబులెన్సు వాహనాలకు దారి ఇచ్చిన సందర్భాలను ఇక్కడ ప్రజలు గుర్తు చేసుకున్నారు.

అద్దె కార్యకర్తల శాపనార్థాలు..

శివారు ప్రాంతాల నుంచి డబ్బులు ఇస్తామని తీసుకొచ్చిన అద్దె కార్యకర్తలను స్థానిక లాడ్జిసెంటర్ దగ్గర ఆపి ఉంచి వారిని పట్టించుకోకపోవడంతో నానా శాపనార్థాలు పెట్టి వెళ్లిపోయారు. మూడు గంటలకు పైగా తాము నిలుచుంటే కనీసం నీళ్లు కూడా ఇవ్వకుండా మా ఉసురు పోసుకున్నారని దుర్భాషలాడారు.

మిత్ర పక్షాలు ఎక్కడ..?

జిన్నాటవర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చంద్రబాబు మీటింగ్‌కు కూడా పెద్దగా జనం రాకపోవడం.. ముఖ్యంగా ముస్లిం మైనార్టీల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంపై టీడీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నసీర్ అహ్మద్‌పై చంద్రబాబు కొంత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వేదిక నుంచి మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు పక్కన నసీర్ అహ్మద్ తప్పితే కనీసం మిత్రపక్షమైన జనసేన గానీ, బీజేపీ నాయకులు గానీ లేకపోవడం చర్చనీయాంశమైంది. ఒకరిద్దరు వాహనంపైకి వచ్చి వెంటనే దిగిపోయారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతుండగా అంతంతమాత్రంగా వచ్చిన జనం చిన్నగా జారుకున్నారు.

ప్రచార పర్వం



వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి విడదల రజిని బ్రాడీపేటలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను కలుసుకుని ఓటు అభ్యర్థించారు.

– పట్నంబజారు



మంగళగిరి ద్వారకానగర్, చినకాకానిలలో వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలకగా, మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు.

– మంగళగిరి



వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు అభ్యర్థి నూరి ఫాతిమా నియోజకవర్గంలోని గుంటూరువారితోటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

– పట్నంబజారు

క్లుప్తంగా

తోకవారిపాలెంలో టీడీపీకి నిరసన సెగ



గుంటూరు రూరల్: ప్రజలకు చేసిందేమి లేక పోయినా కల్లబొల్లి కబుర్లు చెబుతూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లోకి రావద్దని మండలంలోని తోకావారిపాలెం గ్రామ ప్రజలు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులును హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తోకావారిపాలెంలో ప్రచారం నిమిత్తం వెళ్లిన అభ్యర్థిని, టీడీపీ నేతలను స్థానిక ప్రజలు, వైఎస్సార్ సీపీ నేతలు నిలదీశారు. సూపర్ సిక్స్, సూపర్ టెన్ అంటూ మరోసారి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లోకి వస్తున్నారా? అంటూ నిలదీశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 14 సంవత్సరాల కాలంలో దళితులకు చేసిన న్యాయం ఏంటని ప్రశ్నించారు. దళితులపై ప్రేమ పేదలు, దళితులను ఆదుకుని సంక్షేమ పథకాలతో కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందించిన జగన్‌మోహన్‌రెడ్డికే తాము మద్దతు తెలుపుతామని గ్రామ ప్రజలు తెలిపారు. దీంతో ప్రచార కార్యక్రమాన్ని గ్రామ కూడలి వరకూ వెళ్లి అక్కడి నుంచి టీడీపీ నాయకులు వెనుదిరిగారు. దళితులపై ప్రేమ ఉంటే చంద్రబాబు దళితులు, పేదలకు ఏమి న్యాయం చేశాడో ఒక్కటైనా చెప్పాలని అభ్యర్థిని, టీడీపీ నేతలను ప్రజలు ప్రశ్నించారు.

పాల ప్యాకెట్‌కు వెళ్లి తిరిగిరాని లోకానికి..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పాలప్యాకెట్‌కు వెళ్లిన ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. పశ్చిమ గోదావరి జిల్లా, భీమడోలు మండలం, వెలవపేట గ్రామానికి చెందిన రామిశెట్టి వెంకటేష్ నాయుడు పెద్ద కుమారుడు రామిశెట్టి గౌతమ్‌నాయుడు(12) 6వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు రావడంతో తాడేపల్లి రూరల్ కొలనుకొండలోని తాతయ్య కృష్ణారావు ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం పాలప్యాకెట్లు తీసుకురమ్మని తన ద్విచక్ర వాహనం ఇచ్చి బైపాస్ రోడ్‌లోని పాలబూత్‌కు పంపించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎయిమ్స్ హాస్పిటల్ రోడ్‌లోకి వచ్చాడు. ఈ క్రమంలో ఎదురుగా వెళుతున్న క్రేన్‌ను క్రాస్ చేస్తూ అదుపుతప్పి క్రేన్ కింద పడడంతో అక్కడికక్కడే గౌతమ్ నాయుడు మృతి చెందాడు. జరిగిన ఘటనపై తండ్రి రామిశెట్టి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు సిద్ధం

- వైఎస్సార్ సీపీ తాడికొండ అభ్యర్థి మేకతోటి సుచరిత
- అబ్బరాజుపాలెం, రాయపూడి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం



ఎన్నికల ప్రచారంలో భాగంగా వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

రాయపూడి(తాడికొండ): జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అన్ని వర్గాలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాయని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. బుధవారం తుళ్లూరు మండలం అబ్బరాజు పాలెం, రాయపూడి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించిన ఆమెను ప్రతి ఒక్కరూ ఆప్యాయంగా పలకరించి సాదర స్వాగతం పలికారు. అబ్బరాజుపాలెం చర్చిలో ఆమె ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల పాలనలో జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే ఆదర్శవంతమైన పాలనకు శ్రీకారం చుట్టాయన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం చూపకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందని కుటుంబం ఒక్కటైనా ఉందేమో ప్రతిపక్షాలు చూపించగలవా అని ప్రశ్నించారు. 14 సంవత్సరాల తన పాలనలో పేదవాడికి అండగా నిలిచిన ఒక్క సంక్షేమ పథకమైనా ఉందా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను గత 5 సంవత్సరాల పాలనలో అమలు చేసిన జగనన్న మళ్లీ అమలుకు సాధ్యమయ్యే హామీలతోనే ఎన్నికల మేనిఫేస్టోతో వస్తున్నాడని ప్రజలు ఆశీర్వదించి ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, రాష్ట్ర ఎస్సీ విభాగం నాయకులు శృంగారపాటి సందీప్, బుర్రా వెంకట శివారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దానం వినోద్, జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు నాగేశ్వరరావు, జిల్లా జేసీఎస్ కన్వీనర్ తుమ్మూరు రమణారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, ఆలోకం సురేష్, ఆలూరి శ్రీనివాసరావు, ఆరేపల్లి జోజి, బండి ప్రసాద్, ఐనవోలు సుధీర్, వివిధ విభాగాల నాయకులు కొమ్మినేని దత్తు, షేక్ జానీ భాషా, పసుపులేటి అనీల్, పుట్టా నాగరాజు, చనుమోలు రామారావు, పాలకాయల శేషగిరిరావు, సనకా హరిబాబు, ఐనవోలు చంటి, కొప్పుల ఆంద్రీయప్ప, గద్దర్ చెన్నకేశవ మాతంగి, బెజ్జం రాంబాబు, ప్రశాంత్, డీజే శ్రీనివాసరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్రంలోని పేద ప్రజలకు సంక్షేమం అందించడంతో పాటు వారిని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చెంచుపేట కొన్నేరు బజారు నుంచి బుధవారం సాయంత్రం రోడ్డు షో నిర్వహించారు. 31వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు రావి శ్రీనివాసరావు, కోగంటి ఆషు, నబీషా, జ్యోత్స్న, జీఎంఆర్, అహ్మద్, బి.బాబు, గద్దల రమేష్ ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కేఎస్ఎం స్కూల్, ఈద్గా రోడ్డు నుంచి ఇందిరానగర్ కాలనీ వరకు రోడ్ షో నిర్వహించారు. అక్కడ 32వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, మట్లపూడి రాజేశ్వరరావు దంపతులు, సయ్యద్ గౌస్‌లు ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అక్కడి నుంచి ఇందిరానగర్ కాలనీ మీదుగా 33వవార్డుకు రోడ్డు షో వచ్చింది. అక్కడ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మొగల్ అహ్మద్‌బేగ్ వార్డు నాయకులతో కలసి ఆయనకు ఘనస్వాగతం పలికారు. బాలాజీరావుపేటలోని రోడ్డు షో 34వ వార్డుకు చేరుకుంది. అక్కడ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి వార్డు నాయకులతో కలిసి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, కౌన్సిలర్ యాతాటి అనిల్, గుంటూరు కోటేశ్వరరావు, కొమ్మరబత్తుని జయపాల్, 32వ వార్డు నాయకులు బడుగు ఏసుబాబు, సీతాలు, మల్లేశ్వరరావు, శివనాగేశ్వరరావు, రాజు, నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెసర్లంక రమణ, అవుతు రాజశేఖర్‌రెడ్డి, వేజండ్ల శ్రీకాంత్, ఉడుముల మహేష్‌రెడ్డి, కఠారి హరీష్, టెక్స్‌బాల, పెదలంక వెంకటేశ్వర్లు, చెరుకూరి సురేష్‌రెడ్డి, మేకల సురేష్, సీమోను, జానీ, టోపీ సుభానీ, గోల్డ్ రహీమా, యలవర్తి సాంబశివరావు, కాళిదాసు వెంకటేశ్వరరావు, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, పినపాటి నీరంజన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

287 మద్యం కేసులు నమోదు

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మార్చి 16 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రెండు డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో 287 లిక్కర్ కేసులు నమోదు చేసి 298 మందిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసుల్లో అరెస్టు చేసిన వారి వద్ద నుంచి 352.52 లీటర్ల డ్యూటీ పెయిడ్ లిక్కర్, 1810.2 లీటర్ల డ్యూటీ పెయిడ్ బీరు, 1349.43 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, 6.25 లీటర్ల డిఫెన్స్ లిక్కర్‌తో పాటు 6 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్, కల్లు దుకాణాదారులు ఏమైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చే మద్యం, నాటు సారాయి తయారు స్థావరాలపై, అమ్మేవారిపై, కల్తీ కల్లు అమ్మే వారిపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఎక్కడైన అక్రమాలు జరిగినట్లు తెలిస్తే జిల్లా కంట్రోల్ రూం 0863-2233576 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చన్నారు.

కార్మిక పక్షపాతి సీఎం వైఎస్ జగన్

ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న విప్ అప్పిరెడ్డి

పట్నంబజారు: పేదల పక్షాన నిలబడి పెత్తందారులపై ఒంటి చేత్తో పోరాడుతూ పూర్తి కార్మిక వర్గ దృక్పథంతో.. ముందుకు సాగిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని శాసన మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో విప్ అప్పిరెడ్డి చేపట్టిన ప్రభాత ప్రచారం బుధవారం కొనసాగింది. 34వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ బూసి రాజలత ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి మంత్రి విడదల రజిని, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్యను గెలిపించాలని కోరారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసమే కాక ప్రతి పేదవాడి మోహంలో చిరునవ్వులు చిందించేందుకు కులం చూడకుండా.. మతం చూడకుండా.. పార్టీలు కూడా పట్టించుకోకుండా.. అర్హతే ప్రామాణికంగా అనేక పథకాలతో అన్ని వర్గాలకు ఆర్థిక లబ్ధి చేకూర్చిన మనసున్న మంచి ముఖ్యమంత్రి జగన్‌ను తిరిగి సీఎంని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఈ క్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో దిగిన విడదల రజిని, గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కిలారి రోశయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 34వ డివిజన్‌కు చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దేవానంద్, కోఆప్షన్ సభ్యుడు మోతుకూరి వెంకటరత్నం, పార్టీ నేతలు రాయప్ప, జగన్‌కోటి, మాదాసు భాగ్యరావు, గిరి రాము, ఉషారాణి, రెహ్మతుల్లా, కిరణ్, రాజు, కొప్పుల శ్రీనివాస్, అనీల్, రహిముద్దీన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా, వంగవీటి నరేంద్ర తదితరులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పాతగుంటూరు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద పాతగుంటూరు ప్రాంతానికి చెందిన 300 మంది జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తన కుమార్తెన నూరిఫాతిమాను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు యర్రి ధనలక్ష్మీ, పోలవరపు జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు సాయి, వెంకటేశ్వరరావు, భాస్కర్, ఆంజనేయులు, తిరుపతమ్మ, నాగేశ్వరరావు, నర్సరావుపేట అసెంబ్లీ పరిశీలకులు గులాంరసూల్, జీయాఉర్‌రెహ్మాన్, మాధవరావు, బాబు, మోహన్‌రావు, కుంటాబాబు, దాసరి రాజేష్, శ్రీకాంత్, మాధవ చిన్న, హిమగిరి, శివాబన్నీ, సాయి, అకిరా, శివప్రసాద్, శివ, ఈశ్వర్, రవి, మోహన్ పాల్గొన్నారు.

'సోమేపల్లి' సాహితీ సేవ మరువలేనిది

డాక్టర్ పాపినేని శివశంకర్



మాట్లాడుతున్న వెలువోలు నాగరాజ్యలక్ష్మి

నగరంపాలెం: సోమేపల్లి వెంకటసుబ్బయ్య సాహితీ సేవ మరువలేనిదని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం సంయుక్తంగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి వేడుకలు, కవి సమ్మేళనం బుధవారం బృందావన్‌గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షురాలు డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆయన చిత్రపటానికి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య నివాళులర్పించారు. శివశంకర్ మాట్లాడుతూ ఉన్నత వ్యక్తిత్వం సోమేపల్లి సొంతమని అన్నారు. అనేక సాహిత్య కార్యక్రమాలు చేపట్టి, యువతరం కవులను ప్రోత్సాహించారని గుర్తుచేశారు. అధ్యక్షత వహించిన నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ వారి సాహిత్యం మట్టి పరిమళాలు వెదజల్లుతుందని, గ్రామీణ జీవితంతో పెనవేసుకుని ఉంటుందని అన్నారు. ప్రధాన వక్త, ప్రముఖ సాహితీవేత్త తోటకూర వెంకటనారాయణ మాట్లాడుతూ సమర్థవంతమైన అధికారిగా మంచి మనసున్న సాహితీవేత్తగా సోమేపల్లి ప్రశంసలు అందుకున్నా రని తెలిపారు. సోమేపల్లితో ఉన్న సాహిత్య అనుబంధాన్ని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ వివరించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పాన్నూరు వెంకటశ్రీనివాసులు మాట్లాడుతూ సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా అనేక గొప్ప కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. సోమేపల్లి రచనల్లో రైతు జీవితం, మట్టి పరిమళాలు, గ్రామీణ వాతావరణం, మానవ సంబంధాలు, ఆత్మీయ అనుబంధాల సుగంధాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం ఎస్.ఎం.సుభాని, సీహెచ్.శర్మ చేపట్టిన కవి సమ్మేళంలో డాక్టర్ మైలవరపు లలితకుమారి, ఈవూరి వెంకటరెడ్డి, కొణతం నాగేశ్వరరావు, జమదగ్ని, మెట్టు శ్రీనివాసరెడ్డి, షేక్ కాశింబి, పద్మావతి, పింగళి భాగ్యలక్ష్మీ, షేక్.మస్తాన్‌బాబు, కేజేరమేష్, చందూరు శేషమాంబ, డాక్టర్ పి.బలరాం, మునిపల్లె వెంకటరఘునాథరావు, దుర్గాప్రసాద్ చక్కని కవితలు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జయప్రకాశ్, యువ కవి వశిష్ఠ సోమేపల్లి, నానా, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ అరసం లక్ష్యం



కవితా సంకలనం ఆవిష్కరిస్తున్న దృశ్యం

నగరంపాలెం: ప్రజాపక్షం వహించడం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే అభ్యుదయ రచయిత సంఘం(అరసం) లక్ష్యమని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లో సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో బుధవారం 'నేటి ఎన్నికల తీరు తెన్నులపై కవితాగోష్ఠి, నేటి భారతం కవితా సంకలనం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ కవిత సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ 1947 నుంచి నేటి వరకు దేశంలో అసలైన ప్రజాస్వామ్యం స్థిరత్వాన్ని పొందలేదని అన్నారు. స్వాతంత్రోద్యమంలో త్యాగం చేసిన యోధుల్ని, త్యాగశీలురను గాంధీ, నెహ్రూలాంటి వారిని విమర్శిస్తున్న ప్రబుద్ధుల పాలన తీరు తెన్నులు దారుణంగా ఉన్నాయని అన్నారు. కవి సత్యం పక్షం వహించాలని, ఆ పక్షం వహించిన కవుల కవితల సంకలనమే ఎన్నికల భారతం అన్నారు. సంకలనం తీసుకొచ్చిన నేపథ్యాన్ని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కవితా సంకలనం సంపాదలకులు వల్లూరు శివప్రసాద్ వివరించారు. కవితా గోష్ఠిలో పాపినేని శివశంకర్, షేక్ కాశింబీ, ఎంవీ రామిరెడ్డి, మెట్టు శ్రీనివాసరెడ్డి, బొమ్ము ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు, పచ్చల సురేష్‌బాబు, కె.శరత్ హాజరవ్వగా, అరసం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు శరత్, బొల్లా రవి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మేడే వేడుకలు



పతాకావిష్కరణలో జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు

తెనాలి: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడారు. ఏపీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గుండా సురేంద్ర, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఆవుల సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డి రవీంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె రూబెల్, జిల్లా ఉపాధ్యక్షుడు అత్తోట అమృతరాజు, జిల్లా కార్యదర్శి ఉన్నం ప్రవీణ్, అమర్తలూరి ఆనంద్, జలగం రామకృష్ణ, నాలాది ప్రభాకర్, మేకల రవికుమార్, అక్కిదాసు కిరణ్‌కుమార్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కె.రోక్సల్ పాల్గొన్నారు.

నీటికుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

పెదకూరపాడు : మండల పరిధిలోని రామాపురంకు చెందిన ఇద్దరు చిన్నారులు నీటి గుంతలో పడి మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకుంది. రామాపురం గ్రామం ఎస్సీకాలనీకి చెందిన గొడ్డుగర్ల అభి (13), గొడ్డుగర్ల సందీప్ (13) ఇద్దరు గ్రామ శివారులో ఉన్న నీటి గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లారు. గుంతలో దిగారు. ప్రమాదవశాత్తు నీటిగుంతలో చిక్కుకుపోయారు. రాత్రి 9 గంటల సమయంలో అభి తల్లిదండ్రులు కిషోర్, బుజ్జి, సందీప్ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, మరియమ్మలు పిల్లలు ఇంటికి రాలేదని వెతుక్కుంటూ వెళ్లగా చెప్పులు, దుస్తులు నీటి గుంత బయట ఉండటం గమనించారు. స్థానికుల సహాయంతో నీటి గుంతలో దిగారు. ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎన్నికల్లో వీధి నాటకాలు వేస్తున్న టీడీపీ

- గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య
- వైఎస్సార్ సీపీ నేతల ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య పక్కన మర్రి రాజశేఖర్, నూరిఫాతిమా, శేషగిరిరావు తదితరులు

పట్నంబజారు: రాష్ట్రంలో కల్లోల పరిస్థితుల్లో కనిపించని టీడీపీ నేతలు, ఇప్పుడు ఏదో ఉద్ధరిస్తామంటూ ఎన్నికల వేళ వీధి నాటకాలకు తెరతీస్తున్నారని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య ధ్వజమెత్తారు. పాతగుంటూరులోని గంగానమ్మ తల్లి ఫంక్షన్ హాలులో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత ఎలికా శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరిఫాతిమా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రజలకు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని ఏ ఒక్క సాయమైనా చేశారా అని ప్రశ్నించారు. కనీసం కనబడిన పాపాన పోలేదని, ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు అమెరికా నుంచి పెమ్మసానిని దిగుమతి చేశారని విమర్శించారు. స్థానికుడిని ఇక్కడి సమస్యలు పరిస్థితులు పూర్తి అవగాహన ఉన్న తనను ఎంపీగా తనను, తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న నూరిఫాతిమాను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్సీ, తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ప్రజాసమస్యలు పరిష్కరిస్తూ ప్రతి ఒక్కరితో ఎంతో ఆప్యాయంగా ఉండే తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కుటుంబం నుంచి వస్తున్న ఆయన కుమార్తె నూరిఫాతిమాను అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతోందని చెప్పారు. తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతి మాట్లాడుతూ మీ బిడ్డగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గజమాలతో ఘనంగా సత్కరించారు. సమావేశానికి తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా హాజరయ్యారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, నరసరావుపేట నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్, నేరేళ్ల సురేష్, జియావుర్ రహమాన్, కార్పొరేటర్ యర్రి ధనలక్ష్మి పాల్గొన్నారు.

కారు రిపేరు చేస్తూ మీదపడి యువకుడు మృతి

పెదకూరపాడు: కారు రిపేరు చేస్తుండగా జాకీ స్లిప్ కావడంతో యువకుడు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని 75త్యాళ్లూరులో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుత్తికొండ భూపతిరెడ్డి (32) వ్యవసాయంతో పాటు ట్రావెల్స్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు తండ్రి గుత్తికొండ నాగిరెడ్డి రిటైడ్ ఆర్మీ కావడంతో తండ్రికి సాయంగా ఉంటున్నాడు. గతవారం రోజుల క్రితం ట్రావెల్స్‌కు ఉపయోగించే మహీంద్రా లోగోస్ కారు రిపేరు వచ్చింది. భూపతిరెడ్డి బాబాయ్ కుమారుడు వివాహం ఉండటంతో కారు రిపేరు చేసేందుకు కుదరలేదు. పెళ్లి పనుల్లో బిజిగా ఉన్నారు. వివాహం అనంతరం బుధవారం కారు రిపేరు చేసేందుకు డ్రైవర్ నాగూరుతో కలసి కారును జాకీ సాయంతో రిపేరు చేస్తుండగా రిపేరుకు అవసరమైన రెంచీలు తీసుకువచ్చేందుకు డ్రైవర్ వెళ్లగా కారు కింద భాగంలో ఉండి మరమ్మతులు చేస్తున్న భూపతిరెడ్డి పై జాకీ స్లిప్ కావడంతో కారు నుదురుపై పడడంతో అక్కడిక్కడే మృతి చెందారు. రెంచీలు తీసుకు వచ్చిన డ్రైవర్ నాగూరు కారు కింద ఉన్న భూపతిరెడ్డిని చూసి కేకలు వేయడంతో స్థానికులు కారును లేపి చూడగా అప్పటికే మృతిచెందాడు. భూపతిరెడ్డి తెలంగాణలో నైజాంకు చెందిన అమనిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు.

ఎమ్మెల్యే శంకరరావు నివాళులు : ప్రమాదంలో మృతి చెందిన భూపతిరెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరామర్శించి నివాళ్లు అర్పించారు. తండ్రి నాగిరెడ్డిని ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.